చంద్రబాబు ఒక్క మంచైనా చేశాడా?



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మంత్రి కాకాణి



విశేషంగా తరలివచ్చిన ప్రజలు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు ఉపయోగపడేలా ఒక్క మంచైనా చేశాడా.. అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని గురివిందపూడి, కొమ్మలపూడి, ముద్దుమూడి, చెరుకుమూడి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు తన మార్కు చూపించుకునేందుకు కనీసం ప్రజల కోసం ఒక్క పథకమైనా అమలు చేశాడా అని నిలదీశాడు. అందుకే చంద్రబాబుకు మైక్ దొరికితే సీఎం జగన్‌పై తమ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తుంటాడన్నారు. 2014 నుంచి 19 వరకు రాష్ట్రంలో అవినీతి, రాక్షస పాలన సాగిందన్నారు. గతంలో ఏమీ చేయని చంద్రబాబు ఇప్పుడు అధికారం ఇస్తే అది చేస్తా ఇది చేస్తా.. అంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. చంద్రబాబు లాంటి నమ్మకద్రోహికి మరోసారి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తాడన్నారు. సర్వేపల్లిలో తనపై పోటీ చేసేందుకు ఎవరూ సాహసించకపోవడం వల్లే చంద్రబాబు సోమిరెడ్డికి టికెట్ ఇచ్చాడన్నారు.

సోమిరెడ్డికి ఎన్నికలప్పుడే ప్రజలు కనిపిస్తారు

ఎన్నికలప్పుడు తప్ప కనిపించని సోమిరెడ్డికి ప్రజలను ఓటడిగే నైతిక అర్హత లేదని కాకాణి ధ్వజమెత్తారు. కరోనాతో ప్రజలు తల్లడిల్లిపోతుంటే సోమిరెడ్డి ప్రజలను గాలికొదిలేసి బెంగళూరు, హైదరాబాద్‌లలో తలదాచుకున్నాడన్నారు. కరోనా సమయంలో తాను మాత్రం అన్నిరకాలుగా నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచానని గుర్తు చేశారు. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తితే సకాలంలో సాగునీటిని విడుదల చేయించి రైతులు నష్టపోకుండా చూశానన్నారు. నిరంతరం ప్రజలకు అండగా ఉంటానని, ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నేతలు కొమ్మలపూడిలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అంతకుముందు కాకాణికి గురివిందపూడిలో మన్నెమాల సుధీర్‌రెడ్డి, కొమ్మలపూడిలో సర్పంచ్ బందిల వేణుగోపాల్, చెందులూరు శ్రీనివాసులు, ముద్దుమూడిలో చాంద్‌బాషా, చెరుకుమూడిలో కరీముల్లా, మోహన్ నాయుడు, హేమంత్, శశిధర్‌రెడ్డి, వంశీకృష్ణ, మహేష్ తదితరుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఎంపీటీసీ శిరీష, నాయకులు మన్నెమాల శ్రీహరిరెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, చేవూరు ఓసూరయ్య, చేడిమాల బుజ్జిరెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

‘జగన్ మీ కుటుంబ సభ్యుడు’



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కుటుంబాల్లో సభ్యుడు అని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పురంధరపురం గ్రామంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కట్టుబడిపాళెం గ్రామ సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు రూ.24.48 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. పురంధరపురం గ్రామంలో రూ.30 లక్షలతో సీసీరోడ్లు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడూ కనిపించని కొత్త వ్యక్తులు ప్రస్తుతం కనిపిస్తున్నారని వారిని నమ్మవద్దని హితవు పలికారు. కోవూరు టీడీపీ అభ్యర్థి తన ప్రచారంలో పలు విషయాలపై కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

పురంధరపురం గ్రామంలో చంద్రగిరి. ప్రభాకర్, రామ్‌బాబు, ఉపసర్పంచ్ పి.కృష్ణారెడ్డితో పాటు 40 మంది టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అదేవిధంగా రామచంద్రాపురం, పంచేడు, పురంధరపురం గ్రామాలకు చెందిన వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే ప్రసన్న గెలుపునకు కృషి చేస్తామని వివరించారు. ఇస్కపాళెం పంచాయతీ పూలనాయుడు చెరువు గ్రామానికి సంబంధించి 50 ముస్లిం మైనారిటీ కుటుంబాలు కోడూరు మధుసూదన్‌రెడ్డి, ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రసన్న సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సంక్షేమ పథకాల సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, ప్రసన్నకుమార్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవడమే తమ లక్ష్యమని తెలిపారు.

క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

దేవస్థానానికి గేటు బహూకరణ



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి రూ.1.30 లక్షల విలువైన గోల్డ్ కోటెడ్ గేటును గురువారం చీమకుర్తి శివకుమార్ అందజేశారు. శ్రీవారి మూలవిరాట్ ద్వారం వద్ద గేటును అమర్చినట్లు దేవస్థానం నిర్వాహకులు వెల్లడించారు.

సింహపురి పద్య నాటక కళాకారుల సంఘ ఎన్నిక

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని కొండాయపాళెంగేటు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జిల్లా పద్య నాటక కళాకారుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహపురి పద్య నాటక కళాకారుల సంక్షేమ సంఘం పేరుతో నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షులుగా చెంచురామయ్య, తిరుపాల్‌రెడ్డి, రామకృష్ణ, ఖాజామస్తాన్‌ను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కొమ్మిరెడ్డి హరనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వడ్డే చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షులుగా జయరాజు, నజీర్‌బాషా, చెరుకుమూడి భాస్కర్, కార్యదర్శులుగా ఉడతా ప్రభాకర్, సురేష్, మస్తానయ్య, అస్లాం, మహిళా కార్యదర్శులుగా అపరాజిత, భానుమతి, పద్మ, శిరీష ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమానికి పాటు పడతామన్నారు.

చివరిరోజు ఏడు నామినేషన్ల దాఖలు

వెంకటాచలం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గానికి గురువారం చివరి రోజు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరుతో మూడో సెట్‌ను వేణుంబాక సుమంత్‌రెడ్డి ఆర్వో చిన ఓబులేసుకు అందజేశారు. సోమిరెడ్డి పేరుతో మూడో సెట్‌ను ఎస్.దినయ్య, సోమిరెడ్డి శృతి పేరుతో రెండో సెట్‌ను కె.మస్తానమ్మ, జాతీయ జనసేన అభ్యర్థిగా నక్కా మనోహర్, స్వతంత్ర అభ్యర్థులుగా ఎం.పెద పుట్టయ్య, తాటిపర్తి వేణు, కడివేటి వెంకయ్య నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.



కాకాణి పేరుతో మూడో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తున్న సుమంత్‌రెడ్డి

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

ముత్తుకూరు : మండలంలోని మామిడిపూడి, తాళ్లపూడి గ్రామాల్లో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా కోరారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



మనుబోలు : మండల కేంద్రంలోని కోదండరామపురంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం బుధవారం అర్ధరాత్రి కమనీయంగా నిర్వహించారు. ముందుగా అర్చకుడు సాయికుమార్ శర్మ సీతారాములకు పంచామృతాభిషేకం గావించి పట్టువస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. గ్రామస్తులు సీతారాములకు కొబ్బరికాయలు, పండ్లు పూలతో మంగళ హారతులు పట్టారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శ్రీవెంకటేశ్వరలో ప్రాంగణ ఎంపికలు

కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో క్యాపిటల్ వయా ఇండోర్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎనిమిది మంది నాలుగో సంవత్సరపు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.3.50 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.అనిల్‌కుమార్ తెలిపారు. ప్రతిభ కనబరిచి ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

కనులపండువగా రథోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని ప్రధాన ఆలయాల్లో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాలను కనులపండువగా నిర్వహించారు. మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి నగరోత్సవం జరిపారు. భక్తులు విశేషంగా పాల్గొని దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయకర్తలుగా నూకల సీతమ్మ వీలునామా ప్రకారం పేటేటి రాఘవరావు దంపతులు వ్యవహరించారు. రాత్రి పుష్పక విమానంలో వేణుగోపాలుడు భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా సాగిరాజు వెంకటరాజు, సునీత దంపతులు వ్యవహరించారు.

• నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి రథోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం పప్పులవీధిలోని వినాయకస్వామి మందిరం వరకు వెళ్లి తిరిగి దేవస్థానం చేరుకుంది. భక్తులు విశేషంగా పాల్గొని ఆదిదంపతులను దర్శించుకున్నారు.



మూలాపేటలో వేణుగోపాలస్వామి రథోత్సవం

• ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో కోదండరామస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సీతాలక్ష్మణహనుమత్ సమేత కోదండరామస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి నగరోత్సవం జరిపారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం శ్రీరంగరాజపురం, రేబాలవారి వీధి, స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు మీదుగా తడికల బజారుసెంటర్‌కు, అక్కడి నుంచి తిరిగి దేవస్థానం చేరుకుంది. రాత్రి తిరుచ్చి ఉత్సవం జరిపారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



మనుబోలు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కొడవలూరులో అవగాహన ర్యాలీ

• గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

మనుబోలు : మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మొహసినా సుల్తానా పిలుపునిచ్చారు. మనుబోలు మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి నిర్మూలనపై గురువారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు మలేరియా, చికెన్ గున్యా, డెంగీ, మెదడువాపు, పైలేరియా లాంటి వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు దోమల లార్వాను నిర్వీర్యం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ర్యాలీలో సీహెచ్‌ఓ రాజయ్య, హెచ్ఎస్‌లు వెంకటరమణయ్య, హైమావతి, ఏఎన్ఎంలు రాజేశ్వరి, సుభాషిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహ్మదాపురంలో..

పొదలకూరు : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మహ్మదాపురం గ్రామ వీధుల్లో పీహెచ్‌సీ డాక్టర్ నరసింహారావు ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటిసారిగా దోమల ద్వారా మలేరియా వ్యాపిస్తుందని సర్ రోనాల్డ్ రాస్ కొనుగొన్నట్లు తెలిపారు. అప్పటి నుంచి మలేరియా దినోత్సవం జరుపుకోవడం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దోమల కారణంగా మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ, పైలేరియా, మెదడువాపు వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు దోమల లార్వాను నిర్వీర్యం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ర్యాలీలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ కిరణ్‌రిషిత, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని జొన్నవాడ గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. మలేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అహ్మద్‌బాబు, డాక్టర్ వినయ్‌కుమార్, ఎంపీహెచ్‌ఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరులో..

కొడవలూరు: మలేరియా నిర్మూలనపై కొడవలూరులో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల వల్ల వస్తుందన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట ఎనాఫిలస్ దోమవల్ల వ్యాధి వస్తుందన్నారు. మలేరియా సోకిన వారు జ్వరంతో ఉండడంతో పాటు కళ్లు ఎర్రబడడం జరుగుతుందన్నారు. దీనిని 21 రోజుల్లో చికిత్స ద్వారా నయం చేసుకోవాలని చెప్పారు. అంతకంటే ఎక్కువ రోజులు గడిస్తే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏ షఫీ ఉద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పొదలకూరు : ర్యాలీ చేస్తున్న సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడ గ్రామంలో..

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



విడవలూరు : వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న సునందారెడ్డి



పొదలకూరు : వరదాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పూజిత

విడవలూరు : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని ఎంపీ విజయసాయిరెడ్డి సతీమణి సునందారెడ్డి అన్నారు. మండలంలోని వావిళ్ల గ్రామంలో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు మేలు చేశారని, ప్రజలు ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సునందారెడ్డి సోదరి హరిప్రియ, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, స్థానిక నాయకులు పెనుబోలు ప్రసాద్‌రెడ్డి, తాతా శ్రీనివాసులురెడ్డి, కొండా సుధాకర్‌రెడ్డి, అంకబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందినట్లు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. వరుసగా మూడోరోజు తాటిపర్తి పంచాయతీ వరదాపురం, బత్తులపల్లిపాడు గ్రామాల్లో పూజిత గురువారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. వరదాపురం గిరిజన కాలనీలో వినాయక స్వామి దేవస్థానం నిర్మాణానికి తన తండ్రి టీటీడీ ద్వారా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామాల్లో సిమెంటురోడ్లు, సైడ్ డ్రెయిన్లను పూర్తి చేశారని, ఆయన చేసిన అభివృద్ధి పనులను చూసి ఓట్లు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పలుకూరు పోలిరెడ్డి, పామూరు లచ్చారెడ్డి, డి.మురళీకృష్ణారెడ్డి, డి.శ్రీనివాసులురెడ్డి, అచ్చాల సుధాకర్‌రెడ్డి, పి.నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హజరత్‌రెడ్డి, పరందామిరెడ్డి తదితరులు ఉన్నారు.

పార్టీ మారే వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి

కొడవలూరు : వైఎస్సార్‌సీపీని వీడుతున్న నాయకులు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండలంలోని పద్మనాభసత్రంలో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనాభసత్రం కూడలిలో విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన ఓ నాయకుడు టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి వద్ద నగదు తీసుకుని పార్టీ మారినట్లు చెప్పారు. ఈ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేయడంతో పాటు మెయిన్ రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చడం, ఇరువైపులా డ్రెయిన్ ఏర్పాటు చేయించింది ఎమ్మెల్యే ప్రసన్నేనని గుర్తించుకోవాలన్నారు. ప్రశాంతిరెడ్డి బాహాటంగానే నాయకులను కొనుగోలు చేస్తోందని, ఒక్క తలమంచి పంచాయతీ పరిధిలోనే నాయకులకు రూ.50 లక్షలు వెచ్చించారని తెలిపారు. ఎన్నికల కమిషన్ కోవూరుపై ప్రత్యేక దృష్టి సారించి నియమావళిని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, సచివాలయాల మండల కన్వీనర్‌లు గంధం వెంకటశేషయ్య, కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎ.మోహనకృష్ణ, దాసరి వెంకటేశ్వర్లు, వీరి సంపత్‌కుమార్, కె.మల్లికార్జున, సీహెచ్.శేషగిరి, ఓడూరు వెంకటేశ్వర్లురెడ్డి, డి.అనిల్‌కుమార్‌రెడ్డి, శివ, పెంచలయ్య పాల్గొన్నారు.



కొడవలూరు: ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు

ఏడోసారి గెలుపుపై గురి

నల్లపరెడ్డి కుటుంబం 1960 నుంచి రాజకీయాల్లో కొనసాగుతోంది. ఇప్పటి వరకు 11 సార్లు నల్లపరెడ్డి కుటుంబం పోటీ చేస్తే తొమ్మిదిసార్లు ప్రజలు ఆ కుటుంబానికి పట్టం కట్టారు. గతంలో మూడు సార్లు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. ఆయన మరణం తరువాత కుమారుడు ప్రసన్నకుమార్‌రెడ్డి ఏకంగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా ప్రస్తుతం జరుగనున్న సాధారణ ఎన్నికల్లో ఏడోసారి ప్రసన్నను గెలిపించుకునేందుకు కోవూరు నియోజకవర్గ ప్రజలు సిద్ధం అంటున్నారు.

• ప్రసన్న గెలుపు పక్కా అంటున్న ఓటర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కోవూరు నియోజకవర్గంలో మరోసారి ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించుకు తీరుతామని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రసన్నను విజయతీరాలకు చేర్చుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కోవూరు నియోజకవర్గంలో చాలామంది ఎన్నికల సమయంలో వచ్చి వెళ్తుంటారని అటువంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదంటున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్నందున వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



ప్రజలకు నమస్కరిస్తున్న ప్రసన్న

ప్రజల మనిషి ప్రసన్న

1984వ సంవత్సరం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ప్రసన్నకుమార్‌రెడ్డి బీఏ పూర్తి చేశారు. 1993లో శ్రీనివాసులురెడ్డి మరణాంతరం రాజకీయ అరంగ్రేటం చేశారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున కోవూరు నుంచి మొదటిసారి పోటీచేసి గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ఇక వెనుతిరిగి చూడలేదు. నిత్యం ప్రజలతోనే ఉన్నారు. నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య తలెత్తినా స్వయంగా తెలుసుకుని పరిష్కరించారు. తన పనితనంతో ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నారు. తర్వాత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితంగా మెలిగారు. వైఎస్సార్ మరణాంతరం 2011లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో చేరారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అనంతరం 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నమ్మిన వ్యక్తిగా ప్రసన్న పేరుపొంది ఆయనతో ప్రయాణం సాగిస్తున్నారు.

కలిసొచ్చే అంశాలు

ప్రస్తుత ఎన్నికల్లో ప్రసన్నకుమార్‌రెడ్డి విజయానికి కలిసొచ్చే అంశాలు చాలానే ఉన్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో ప్రతి ఇంటిని ఎమ్మెల్యే పలకరించారు. వారి సమస్యలు పరిష్కరించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో పలు అభివృద్ధి పనులను చేసి చూపించారు. బుచ్చిరెడ్డిపాళెం మేజర్ పంచాయతీని నగర పంచాయతీగా మార్చడం, బుచ్చి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, రూ.85 కోట్లతో ఎస్ఎస్సార్ తాగునీటి పథకం కార్యక్రమాలు ప్రసన్న కృషితో జరిగినవే. విడవలూరు, ఇందుకూరుపేట మండలాలను కలుపుతూ పెన్నా నదిలో ముదివర్తి నుంచి ముదివర్తిపాళెం వరకు రూ.100 కోట్లతో కాజ్‌వే నిర్మాణానికి ఎమ్మెల్యే ఇటీవల శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం చేసిన హామీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రసన్న పట్టాలెక్కించారు. కోవూరులో కలుజు వద్ద బ్రిడ్జి నిర్మాణం, కొడవలూరు మండలం రాజుపాళెం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి ప్రసన్న పూర్తి చేసిన ప్రధాన పనులు. వీటి నిర్మాణం కోసం గతంలో ప్రజలు ఎన్నో ధర్నాలు చేశారు. వైఎస్సార్‌సీపీ మొదటిసారి అధికారంలోకి రాగానే ఈ సమస్యలు పరిష్కారమయ్యాయి. వీటికితోడు ప్రతి ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలు, ప్రతి గ్రామంలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.కోట్లలో ప్రజలకు లబ్ధి చేకూరింది. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ కాలువల నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరంతరం కొనసాగుతుండటం కలిసొచ్చే అంశాలు. టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి క్షేత్రస్థాయిలో బలం లేకపోవడం, నియోజకవర్గంపై కనీస అవగాహన లేమి, సొంత పార్టీలోనే వర్గపోరు నడుస్తుండటం వంటి అంశాలు ప్రసన్న విజయానికి దోహదం చేస్తాయని ప్రజలు అంటున్నారు.